క్లుప్తంగా

ముగ్గురు వైద్యులకు పదోన్నతులు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న ముగ్గురు గైనకాలజిస్టులకు పదోన్నతి లభించింది. ఆయా కాలేజీల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారికి ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు అనంతపురంలో పనిచేస్తున్న డాక్టర్ పద్మజ, నంద్యాలలో మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న డాక్టర్ స్నిగ్ధ కర్నూలుకు బదిలీ అయ్యారు. కర్నూలులోనే విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సావిత్రి పదోన్నతిపై ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు. కాగా గైనకాలజి విభాగంలో మొత్తం ఏడు యూనిట్లకు గాను ప్రస్తుతం ఆరుగురు ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు.మరో ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జె.లలితమ్మ

కర్నూలు(సెంట్రల్): దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టే రెజ్లర్లను వేధింపులకు గురిచేస్తున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరన్‌సింగ్‌ను అరెస్టు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె.లలితమ్మ డిమాండ్ చేశారు. 20 రోజులుగా ఢిల్లీలో రెజ్లర్లు అయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఎంపీ వ్యవహార శైలిపై నిరసన ప్రదర్శనలు జరుగుతున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం అన్యాయమన్నారు.కార్యక్రమంలో నాయకులు ఎస్.మునెప్ప, మనోహర్‌మాణిక్యం, బి. వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏపీ ఉద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు కోరారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సీఎంవైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాలను భర్తీ చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. గ్రూప్స్ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు, నాయకులు శ్రీనివాసులు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా సందేల్ చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్: ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సందేల్ చంద్రశేఖర్ ఎంపికయ్యారు. నెల్లూరులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కంచుగంటల శ్యాంసుందరరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీకి ఎంపికైన ఇరువురికి జిల్లా కమిటీ బుధవారం శుభాకాంక్షలు తెలిపింది.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

కర్నూలు (టౌన్): వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ వివాహిత కర్నూలు నగరంలో కోచింగ్ తీసుకుంటున్న కూతురును చూసేందుకు వచ్చి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి భర్త పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల మేరకు.. కడప పట్టణంలోని ఓంశాంతి నగర్‌కు చెందిన పులిమి జేమ్స్ ఏపీఎస్‌పీడీసీఎల్ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పులివెందులలో పనిచేస్తున్నాడు. 18 సంవత్స రాల క్రితం ఇతనికి అదే పట్టణానికి చెందిన జాయిస్ సువర్ణకుమారి (44) తో వివాహమైంది. కుమారుడు, కూతురు సంతానం. కర్నూలు నగరంలోని ఆకాష్ ఇన్స్టిట్యూట్‌లో సీబీఎస్ఈ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కూతురు గ్లోరి ఎవాంజిలిన్‌ను చూసేందుకు ఈనెల 13న సువర్ణకుమారి వచ్చారు. ఈనెల 16 వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఉల్చాల రోడ్డులోని వసుంధర నెస్ట్ టవర్స్‌లోని ప్రశాంత్ అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా ప్రశాంత అనే ఇంట్లో ఆత్మహత్య జరగడంపై అనుమానాలున్నాయని భర్త పులిమిజేమ్స్ నాలుగోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : అన్నీ మంచి శకునములే, ఫాస్ట్ ఎక్స్,కస్టడీ, విరుపాక్ష,ది కేరళ స్టోరీ, పొన్నియిన్‌సెల్వన్-2,గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ, ఫాస్ట్ ఎక్స్ . అన్నీ మంచి శకునములే, ఉగ్రం , విరుపాక్ష, ది కేరళ స్టోరీ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: కస్టడీ, అన్నీ మంచి శకునములే, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, ది కేరళ స్టోరీ , ఉగ్రం, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3, ఐబీ 71
భరత్ కాంప్లెక్స్ : కథ వెనుక కథ, పొన్నియిన్ సెల్వన్-2, ది కేరళ స్టోరీ
శ్రీరామ : రామబాణం
రాజ్ : ఫాస్ట్ ఎక్స్
విజయ : ది కేరళ స్టోరీ

మామూళ్లు ఇవ్వాల్సిందే!

- డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వసూలు చేయిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు
- నేరుగా స్టాంపు డ్యూటీ 7.5 శాతానికి బదులు 8.5 శాతం వసూలు
- డాక్యుమెంటేషన్‌కు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్న రైటర్లు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మితిమీరిపోతున్న అవినీతి



కర్నూలు జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయల్లో అవి నీతి మితిమీరిపోతోంది. డాక్యుమెంట్ రైటర్లు, సబ్‌రిజిస్ట్రార్లు కుమ్మక్కై కార్యాలయాలకు వచ్చిన క్రయ, విక్రయదారులను దోచుకుంటున్నారు. కొందరు సబ్‌రిజిస్ట్రార్లు నేరుగా రైటర్లతో మార్కెట్‌విలువలో ఒక్కశాతాన్ని తమకు లంచంగా వసూలు చేయించుకుంటున్నారు.

ప్రశ్నిస్తే బయటకు వెళ్లమంటారు?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అన్నింటిలో ఆస్తుల క్రయ, విక్రయాల ప్రక్రియలో భాగంగా స్టాంపు డ్యూటీ కింద మార్కెట్ విలువలో 7.5 శాతం మొత్తాన్ని చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలి. ఇందులో 5.5 శాతం స్టాంపు డ్యూటీ, 1.5 శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, ఒక్క శాతం రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుంది. దీనికి అదనంగా యూజర్ చార్జీ రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరు సబ్ రిజిస్ట్రార్లు 7.5 శాతానికి అదనంగా మరో ఒక్క శాతాన్ని వారికి లంచంగా సబ్ రిజిస్ట్రార్లకు డ్యాకుమెంట్ రైటర్లు వసూలు చేసిపెడుతున్నారు. ఎవరైనా ఏమైనా అంటే సబ్‌రిజిస్ట్రార్‌కు ఇవ్వాలని వారు చెబుతుండడంతో చేసేదేమి లేక వారు తలఊపాల్సి వస్తోంది. కాగా, ఒక్క శాతం అదనపు వసూలు అన్నది నిబంధనలు ప్రకారం ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే. ఏదైనా కొర్రీ ఉంటే ఎక్కువ సమర్పించుకోవాల్సిందే. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే మొదట కార్యాలయం నుంచి బయటకు వెళ్లు అంటారు. దీంతో విధిలేని పరిస్థితిలో క్రయ, విక్రయదారులు వాళ్లు అడిగిన మొత్తాన్ని సమర్పించుకోవాల్సి వస్తోంది.

ఉన్నతాధికారులకూ భాగం

సబ్ రిజిస్ట్రార్లు వసూలు చేసిన మొత్తంలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు భాగస్వాములు అని అంటుంటారు. సబ్ రిజిస్ట్రార్ తన పైస్థాయి అధికారులకు వసూలు చేసిన దానిలో నెల నెలా కొంత మొత్తం ఇవ్వాల్సి ఉంటుంది. ఇవ్వకపోతే వారిని ఇబ్బంది పెడుతుంటారని చెబుతుంటారు. పైగా సీనియర్ అసిస్టెంట్లకే ఎక్కువగా ఎస్ఆర్ఓ విధులు కేటాయిస్తారు. ఆ సమయంలోనే వారితో అన్ని క్లియర్‌గా చెప్పి పంపుతుంటారు.

విక్రయదారులను పీడిస్తున్న రైటర్లు

మరోవైపు డాక్యుంట్ రైటర్లు క్రయ, విక్రయదారులను పీడించి పిప్పి చేస్తున్నారు. డాక్యుమెంట్ తయారు చేయడానికి ఏకంగా పార్టీలను బట్టి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొందరైతే మూడు వేలు కూడా తీసుకుంటున్నారు. వీరి దగ్గర కూడా ఏమి అనలేని పరిస్థితి. ఏమైనా అంటే డాక్యుమెంట్ తయారు చేసి ఇవ్వరు. దీంతో విక్రయదారులకు ఏం చేయాలో దిక్కుతోచడంలేదు.

ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతాం

మార్కెట్ విలువలో అదనంగా 1 శాతం వసూలు చేస్తున్నట్లు మాకైతే ఫిర్యాదు లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పూర్తిస్థాయి విచారణ జరుపుతాం. డాక్యుమెంట్ రైటర్ల దగ్గరకు వెళ్లకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్లనే క్రయ, విక్రయదారులు కలిస్తే మంచిది. విక్రయదారులే డాక్యుమెంటను తయారు చేసుకునే విధానం అమల్లో ఉంది.

– నాగలింగేశ్వరరావు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్

ఆర్థిక సహాయం అందజేతపై హర్షం

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ కోసం మక్కా, మదీనా ప్రాంతాలకు వెళ్లే యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు యూనుస్ అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లా నుంచి 274 మంది, నంద్యాల నుంచి 121 మంది హజ్‌కు వెళ్తున్నారన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.80వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసినట్లు వెల్లడించారు.

దొంగ అరెస్టు

కర్నూలు : నగర శివారులోని నాగేంద్రనగర్‌లో నివాసముంటున్న ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుడు రమణ ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. రమణ ఈనెల 13వ తేదీన ఇంటికి తాళం వేసి మానవపాడుకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగ తాళాలు పగులగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 9 తులాల బంగారు, వెండి ఆభరణాలను మూట కట్టుకుని ఉడాయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో దొంగ షేక్ సమీర్‌బాషాను కోడుమూరు రోడ్డులోని డ్రైవర్స్ కాలనీలో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి నగలు రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు నాలుగో పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధికే పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన 2వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీబీ మసీదు లైన్, గడియారం ఆసుపత్రి, అలిషేర్ బాగ్ వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల బతుకులు మారాలంటే ఆర్థిక తోడ్పాడు అవసరమని సీఎం వైఎస్ జగన్ భావించారన్నారు. అందుకే ఈ నాలుగేళ్లలో ఎన్నో పథకాలు తీసుకొచ్చారన్నారు. ఈ పథకాలను సక్రమంగా ఉపయోగించుకుంటే ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కవచ్చని చెప్పారు. కుల మతాలు, రాజకీయ పార్టీలు, సిఫార్సులకు తావు లేకుండా అర్హులందరికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్‌లు ఫిరోజ్, ఖాదర్ బాషా, నాయకులు అస్లాం, మున్నా, చాంద్ బాషా, అనురాధ వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనిని వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు తాము గడప గడపకు వస్తున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా బలోపేతమవుతున్నారన్నారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సులతో పాటు ఆ పార్టీ నాయకుల అండదండలు ఉండాలన్నారు. ప్రస్తుత తమ ప్రభుత్వంలో అర్హతే కొలమానం అన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ గమనించి రాబోయే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్ రెడ్డికి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగలక్ష్మీరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జెసీఎస్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, స్థానిక నాయకులు మహేశ్వరరెడ్డి, రంగారెడ్డి, సంజీవరెడ్డి, కేశవరెడ్డి, నవీన్, రామ్మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచండి



మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కర్నూలు డీఎస్పీ

కర్నూలు: అసాంఘిక కార్యకలాపాలు మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణా వంటి వాటిపై నిఘాను మరింత విస్తృతం చేయాలని కర్నూలు డీఎస్పీ కె.జయశేఖర్ క్షేత్రస్థాయి పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విచారణలో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేసి శివారు కాలనీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సర్కిల్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి కేసులు నమోదవుతున్నాయి, వాటి కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర విషయాలను సీఐ తబ్రేజ్‌తో చర్చించారు. ఎస్ఐలు సురేష్, చిరంజీవి, విశ్వనాథ్‌రెడ్డి, రామకృష్ణ, రవూఫ్ తదితరులతో కూడా వారివారి సెక్టార్ల పరిధిలో నమోదవుతున్న కేసుల విషయంపై ఆరా తీసి పోలీసు విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక తన నివాసంలో కర్నూలు-3, 4 వార్డుల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బతుకుల్లో మార్పు తీసుకొచ్చేందుకు సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్ఆర్‌సీపీని బలోపేతం చేసేందుకు త్వరలో వార్డుల పర్యటన చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

హాకీ పోటీలకు ప్రశాంత్ ఎంపిక

కర్నూలు (టౌన్): హాకీ జాతీయ స్థాయి పోటీలకు గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రశాంత్ ఎంపికయ్యారు. ఈ విద్యార్థి గత ఫిబ్రవరి 25 న విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ మెన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. దీంతో ఈనెల 19 నుంచి 25 వరకు ఒడిశా రాష్ట్రం రూర్కెలాలో నిర్వహించనున్న హాకీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు.

27 నుంచి పిఠాపురంలో రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 27, 28 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో 8 వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, పురుషుల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ కేటగిరిలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు వచ్చే నెల 17,18 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రైఫిల్ షూటింగ్ శిబిరం ప్రారంభం

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో బుధవారం సాయంత్రం వేసవి రైఫిల్ షూటింగ్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. అతిథులుగా టౌన్ మోడల్ జూనియర్ కళాశాల లెక్చరర్ అనురాధ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్వేత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో గుర్తింపు ఉన్న రైఫిల్ షూటింగ్‌లో చిన్నారులు రాణించాలన్నారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.సోమశివారెడ్డి

కర్నూలు (రూరల్): ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్లు బస్సులను ఏకాగ్రతతో నడపాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.సోమశివారెడ్డి అన్నారు. పీఆర్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అంబేడ్కర్ భవనంలో ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి.సోమశివారెడ్డి హాజరై మాట్లాడారు. డ్రైవర్లందరూ విధి నిర్వహణలో సత్ప్రవర్తనతో ఉండి విద్యార్థులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. వాహనాలను అధిక వేగంతో నడపరాదని సూచించారు. ప్రతిరోజూ వాహనం యొక్క స్థితిని, టైర్లు, బ్రేక్స్ చెక్ చేసుకోవాలన్నారు. ఏమాత్రం చిన్న పొరపాటు జరిగినా పెను ప్రమాదం తప్పదన్నారు. కార్యక్రమంలో పీఆర్‌డీఎస్ అధ్యక్షుడు దరగయ్య, వాసుదేవ, శ్రీనివాస్, కృష్ణుడు పాల్గొన్నారు.

దుల్హన్ స్కీంను సద్వినియోగం చేసుకోండి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదింటి ఆడ పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దుల్హన్ స్కీం అమలు చేస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక మహ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ తరఫున ఆడపిల్లల పెళ్లి ఖర్చుల కోసం 50 మందికి రూ.3వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుల్హన్ స్కీం ద్వారా అందించే సాయం మొత్తాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచారని చెప్పారు. కార్యక్రమంలో సీఐ తిమ్మారెడ్డి, మైనారిటీ ఈఓ నజీర్ అహ్మద్, హాఫీజ్ అబ్దుల్లా, వక్ఫ్‌ఇన్‌స్పెక్టర్లు అల్తాఫ్, అజీమ్ పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతికి సీఎం ప్రాధాన్యత

కర్నూలు(రాజ్‌విహార్): మైనారిటీల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం పాతబస్తీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ముస్లిం పక్షపాతి అయిన సీఎం జగన్ హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.80 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. మన రాష్ట్రం నుంచి వెళ్లే 1,813 మంది యాత్రికుల ఖాతాల్లోకి నగదు జమ చేసినట్లు తెలిపారు. హజ్‌కు వెళ్లే ప్రతి యాత్రికుడు సర్వ మానవాళి కోసం దువా చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హాఫీజ్ మంజూర్ అహ్మద్, అబ్దుల్లా హాఫీజ్‌సాబ్, మౌలానా షావలి, ఖాజీ తౌసిఫ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మెనూ అమలు చేయాలి

- మౌలిక సదుపాయాలకు నివేదిక సమర్పించండి
- బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకోండి
- ఐసీడీఎస్ సమీక్షలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల్లో మెనూ ప్రకారం భోజనం, ఇతర పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తాను గత శుక్రవారం కల్లూరు మండలం తడకనపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించినట్లు చెప్పారు. అక్కడ మెనూ ప్రకారం భోజనం చేయలేదని, ఆహార పదార్థాలు కూడా సరిగ్గా ఉడకలేదన్నారు. అంతేకాక ఆ అంగన్‌వాడీ పరిసరాలు పరిశుభ్రంగా లేవని, పిల్లలు నేలపైనే కూర్చొని తింటున్నారన్నారు. పిల్లలకు ఇవ్వాల్సిన పుస్తకాలను సైతం ట్రంక్ పెట్టెల్లో పెడితే ఏం లాభమని ప్రశ్నించారు. ఇక నుంచి ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ అమలుతోపాటు పిల్లలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం, పుస్తకాలు, ఇతర వస్తువులు సక్రమంగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన ఫ్యాన్లు, ట్యూబ్‌లు, టేబుళ్లు, కుర్చీలు, ప్లేట్లు కావాల్సి వస్తే రెండు రోజుల్లో నివేదించాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. బాల్యవివాహాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు నిరంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి, సీడీపీఓలు పాల్గొన్నారు.

గుడ్‌టచ్..బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించండి

కర్నూలు(సెంట్రల్): వసతి గృహాల్లోని విద్యార్థులకు గుడ్ టచ్..బ్యాడ్ టచ్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంక్షేమ శాఖలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల తక్షణ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 24వ తేదీన జగనన్న విద్యా దీవెన కార్యక్రమం ఉండడంతో సంబంధిత విద్యార్థుల తల్లిలేదా విద్యార్థిని ఈకేవైసీని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బీసీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖలు, ఎస్సీ, బీసీ, కార్పొరేషన్లపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, అన్ని సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంఘిక నాటికలకు ప్రత్యేక గుర్తింపు

- జాతీయ స్థాయి నాటికల పోటీల ప్రారంభంలో నగర మేయర్ రామయ్య



మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు కల్చరల్: తెలుగు నాటక రంగంలో సాంఘిక నాటకాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. పీఎంకేఎం, వైఎస్సార్ కళాపరిషత్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న 42వ జాతీయ స్థాయి నాటిక పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నాటికల ప్రదర్శనకు తగినంత ప్రచారం ఉండాలని దానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. రాష్ట్రంలో నంది నాటక పోటీలు నిలిచిపోవడంతో కళాకారుల ప్రతిభకు గుర్తింపు లేకుండా పోయిందని కళాకారులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. మేయర్ స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. పీఎంకేఎం వ్యవస్థాపకుడు వెంకటరమణ మాట్లాడుతూ మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో నాటిక పోటీలు నిర్వహిస్తామన్నారు.అనంతరం కళాకారులను మేయర్ సన్మానించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు సభ్యులు పాల్గొన్నారు.



ఇతిహాసం నాటికలో ఓ సన్నివేశం

అలరించిన నాటికలు

- మనిషి జన్మకు అర్థం పరమార్థమైన అమ్మ కథను ఇతిహాసం నాటికలో అద్భుతంగా ప్రదర్శించారు విజయవాడ మైత్రీ కళా నిలయం వారు. ఈ నాటికను స్నిగ్ధ రచన చేయగా టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు.
- వరి పండించే రైతు లేకపోతే మనిషి లేడని రైతే రాజు పేరుతో హైదరాబాద్ కళాంజలి వారు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కంచర్ల సూర్యప్రకాష్ రచించిన ఈ నాటికను కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.